క్లుప్తంగా

నేడు పాలకుర్తిలో ఎమ్మెల్యే పర్యటన

పాలకుర్తి టౌన్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని పాలకుర్తి మండలం వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం నిర్వహించే ఉత్తరద్వార దర్శనంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో క్రైస్తవులకు దుస్తుల పంపిణీ, ప్రభుత్వ ఆస్పత్రిలో కో ఆర్డినేషన్ సమాశం, మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్, డాక్టర్ చుక్కా రామయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను వి ద్యార్థులకు ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని తెలిపారు.కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కొరారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

చిల్పూరు: చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచారులు వేదమంత్రాల మధ్య భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు–శిరీష దంపతులతో పాటు కుంచాల సంపత్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: ధనుర్మాసం సందర్భంగా ఘన్‌పూర్ శ్రీ తిరుమలనాథస్వామి దేవాలయంలో ప్రతి రోజూ పూజలు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన పూజారి కలకోట రామానుజాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోయుక్తంగా పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలు, పూజలు జనవరి 14 వరకు కొనసాగుతాయన్నారు. నేడు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపను పొందాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ జిల్లా నేత

బచ్చన్నపేట : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మండల కేంద్రానికి చెందిన కేబీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొండి వెంకట్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గెలిచిన తర్వాత కలిసి పూల బోకేను అందించి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బొమ్మెన ఆంజనేయులుగౌడ్, వెంకటేష్ పలువురు ఉన్నారు.

విద్యాశాఖ కార్యదర్శిని కలిసిన చైర్మన్



బచ్చన్నపేట: రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా నియమితులైన బుర్రా వెంకటేశంను వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన ముఖ్య కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా నియామకం కావడం ఈ రాష్ట్ర విద్యార్థులు చేసుకున్న పుణ్యమని, విద్యాశాఖను మరింత బలోపేతం చేస్తారని అన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



లింగాలఘణపురం: సమీక్ష సమావేశాలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సిరిపురం జీపీని సందర్శించిన ఆయన రికార్డులతోపాటు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చేపట్టిన ఇంకుడు గుంతలు, మ్యాజిక్ సోక్‌ఫిట్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి.. తన పదవీ కాలం మరో నెల మాత్రమే ఉందని, చేపట్టిన పనులకు ఇంకా బిల్లులు రాలేదని అదనపు కలెక్టర దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తయారు చేసిన ప్రొఫైల్‌ను పరిశీలించి మండల పరిధి 19 శాఖల అధికారులు ఎంపీడీఓ ఆధీనంలో పని చేయాలన్నారు. ఆయన వెంట డీఆర్‌డీఓ మొగిలప్ప, సీఈఓ అనిల్, ఎస్‌బీఎం డీసీ కరుణాకర్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.



జఫర్‌గఢ్ : కూనూర్‌లో రామనుజన్ చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



లింగాలఘణపురం : గణిత ఉపాధ్యాయులకు సన్మానం



దేవరుప్పుల : మాట్లాడుతున్న ప్రభాకర్

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జనగామతో పాటు పట్టణంలోని ఆయా కాలనీల్లో, తరిగొప్పుల, లింగాలఘణపురం, బచ్చన్నపేట, దేవరుప్పుల, రఘునాథపల్లి, నర్మెట, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, కొడకండ్ల, పాలకుర్తి, జఫర్‌గఢ్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నిత్యజీవితంలో ఏ రంగాల్లో రాణించాలన్నా లెక్కలు తప్పనిసరి అని కొనియాడారు. స్కూళ్లలో వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు, టాలెంట్ టెస్టులు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమాల్లో నోడల్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ : ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో గణిత దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



జనగామ : సాన్‌మారియా పాఠశాలలో..



తరిగొప్పుల : రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రఘునాథపల్లి : విద్యార్థులతో హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు



పాలకుర్తి : కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో టీచర్లు

సంక్షిప్త సమాచారం

శాస్త్రీయ పద్ధతిలో బోధన మేలు

బచ్చన్నపేట : విద్యార్థులకు శాస్త్రీయ పద్ధతిలో బోధన చాలా మేలు అని చదివిన దాని కంటే ఒక సారి చూస్తేనే ఎక్కువగా గుర్తు పెట్టుకుంటారని జనగామ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మల్లవరం అరవింద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కేసిరెడ్డిపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కేంద్ర నిధులు స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రూ.16 లక్షల నిధులతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్‌కు భూమి పూజ చేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ భిక్షపతి, సర్పంచ్ దివ్యారెడ్డి, హెచ్‌ఎం స్వామి, పాల్గొన్నారు.

గ్యాస్ ఈ–కేవైసీకి బారులు

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ వినియోదారులు గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ వద్ద బారులు తీరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500 లకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని తెలుపడంతో ఈ–కేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని పలు గ్రామాల వినియోగదారులు బారులు తీరుతున్నారు. గ్యాస్ ఏజెన్సీ అధికారులు ఈ–కేవైసీకి రూ.200 తీసుకుంటూ గ్యాస్ పైప్‌ను కచ్చితంగా తీసుకోవాలని చెబుతున్నారు. ఈ కేవైసీ తప్పని సరి కావాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోయినా వినియోగదారులు, కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు.

దాతల తోడ్పాటు అభినందనీయం



కొడకండ్ల : అచేతన పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలకు దాతల తోడ్పాటు అభినందనీయమనీ కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మోకరాల దివ్య, యాకేష్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి నిరుపేదలైన వారిని గుర్తించి చలికాలంలో వారికి అవసరమైనటువంటి దుప్పట్లను సమకూర్చి దాతలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంగాల మల్లారెడ్డి, నెమరుగొమ్ముల వెంగళరావు, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తార, పాల్గొన్నారు .

మేకలగట్టు భూదాన్ భూములు పేదలకే

రఘునాథపల్లి: మండలంలోని మేకలగట్టులోని 208 సర్వే నంబర్‌లోని భూదాన్ భూములు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ గ్రామ ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన పేదలకు అందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్‌చందర్‌రెడ్డి పా ర్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మండలగూడెం, మేకలగట్టులో జరిగిన కాంగ్రెస్ గ్రామశాఖల సమావేశంలో ఆయన పా ల్గొని మా ట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎ న్నికల్లో సత్తా చాటి అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్టీసీ బస్సు నుంచి స్మార్ట్‌ఫోన్‌ను పోగొట్టుకున్న మహిళకు ఆ ఫోన్‌ను జిల్లా నాయకుడు కోతి రాములుగౌడ్ అప్పగించాడు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బి.లావణ్య తొర్రూర్‌లోని ఆమె తల్లి గారింటికి వచ్చింది. తిరిగి తొర్రూర్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే ఆర్టీసీ బస్సులో శుక్రవారం సాయంత్రం వెళ్తున్న క్రమంలో స్థానిక పాత గాంధీ చౌరస్తా సమీపంలో ఉన్న ఎస్‌ఎస్‌కే ఆసుపత్రి వద్ద లావణ్య తన రూ.20వేల విలువైన స్మార్ట్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. కాగా ఆ సమయంలో అక్కడే ఉన్న పాంనూర్ గ్రామ సర్పంచ్ భర్త, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోతి రాములుగౌడ్ వెంటనే ఫోన్‌ను తీసుకుని బస్సును తన బైక్‌తో ఫాలో అయి బస్సులో ఉన్న లావణ్యకు అప్పగించాడు. ఆర్టీసీ అధికారులు, స్థానికులు అతడిని అభినందించారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు

చిల్పూరు: ఇప్పటి వరకు పార్టీ కోసం పాటుపడ్డ ప్రతీ కార్యకర్తకు పదవులపరంగా తగిన గుర్తింపు ఉంటుందని ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురికావద్దని పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్ అన్నారు.పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని వెంకటాద్రిపేట, వెంకటేశ్వరపల్లి, తీగలతండాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోటీలో ఉండే ఆశావహుల పేర్లను తీసుకోవడం జరుగుతుందన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జనగామ రూరల్: వరంగల్–హైదరాబాద్ సమీపంలోని పెంబర్తి సమీపంలో రోడ్డు సర్వే రాయికి 45 మీటర్ల దూరంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సృజన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడు సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని రెండు కాళ్లకు నల్లటి ధారం కట్టి ఉండి ఒక చేతికి రాగి కడియం ఉందని తెలిపారు. నీలి రంగు టీషర్ట్, నల్ల స్వెట్టర్, వాయిలెంట్ కలర్ నైట్ ప్యాట్ ధరించి ఉన్నాడని ఎవరికైె ఆచూకీ తెలిస్తే జనగామ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 8712685032, 8712685260, 8172685202 సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని జంతువు దాడిలో దూడ మృతి

తరిగొప్పుల: గుర్తుతెలియని జంతువు దాడిలో దూడ మృతి చెందింది. దీంతో మండల పరిధిలో రెండు వారాల వ్యవధిలో 6 దూడలు మృత్యువాత పడ్డాయి. మండలకేంద్రానికి చెందిన గాజుల చక్రపాణికి చెందిన పశువుల పాకపై గురువారం రాత్రి గుర్తుతెలియని జంతువు దాడి చేసింది. అక్కడున్న దూడను హతమార్చింది. మెడ భాగం వద్ద గాయం చేసి గుండె, అవయవాలు తినేసింది.

ఆటో బోల్తా..డ్రైవర్‌కు తీవ్రగాయాలు

చిల్పూరు: కిరాయికి వచ్చిన ఆటో తిరిగి వెళ్తుండగా రోడ్డుపై తవ్విన కాలువ గుంతను తప్పించబోయి బోల్తా పడడంతో డ్రైవర్ గడ్డం సారయ్యకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని పల్లగుట్ట–కృష్ణాజీగూడెం రోడ్డులో జరిగింది. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన సారయ్య ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం ఉదయం దమ్మన్నపేట నుంచి చిల్పూరు మండలం ఫత్తేపూర్‌కు కిరాయి దొరకడంతో వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్తున్నాడు. కృష్ణాజీగూడెం దాటాక బొమ్మల దగ్గర రోడ్డును ఇటీవల పైప్‌లైన్ కోసం కాలువలు తవ్వి మట్టితో మూయకుండా అలాగే వదిలేశారు. వేగంగా వస్తూ కాలువ గుంతను తప్పించబోయి బోల్తా పడడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న సీపీఎం నాయకుడు సాదం రమేష్ 108కు సమాచారం ఇవ్వగా ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

బచ్చన్నపేట : కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమార్థం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హత కలిగిన వారందరూ వినియోగించుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శివశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం, పోచన్నపేట గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరామర్శ

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌కు చెందిన దాట్ల ఎల్లమ్మ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

దేవరుప్పుల : మండలంలోని సింగరాజుపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు అటికం కిరణ్‌గౌడ్‌కు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండ పెద్ద మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్లయ్య, నల్ల యాదగిరి,ఉట్ల శివారెడ్డి, సారయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు భూక్యా సజ్జన్‌నాయక్ ఉన్నారు.

పోచన్నపేటలో డీపీఓ విచారణ



జీపీ రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ రంగాచారి

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేట జీపీ పరిధిలో పంచాయతీ కార్యదర్శి తీర్మానాలు లేకుండానే నిధులు డ్రా చేస్తున్నారని ఆరోపిస్తూ వార్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి విచారణ చేపట్టారు. సర్పంచ్ గట్టు మంజుల, ఉపసర్పంచ్ జూల కృష్ణ పలువురు వార్డు సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. జీపీ రికార్డులను పరిశీలించి, గ్రామసభ నిర్వహించినప్పుడు వార్డు సభ్యుల సంతకాలను హాజరు రిజిస్టర్‌లో కూడా తీసుకోవాలని కార్యదర్శి వెంకటేష్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులను వసూలు చేయాలి

జిల్లాలోని ప్రతిపల్లెను పరిశుభ్రంగా ఉంచాలని దాంతో పాటు వంద శాతం పన్నులను వసూలు చేయాలని డీపీఓ రంగాచారి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం సానిటేషన్ పనులను సానిటేషన్ పనులను చేయించాలని, చెత్తను ఆరు బయట వేయకుండా జీపీ ట్రాక్టర్‌లలో వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, కార్యదర్శులు రూపాచైతన్య, సౌజన్య, కవిత, రేవతి, అనిల్‌రాజ్, దేవీ ప్రసాద్, పాల్గొన్నారు.

నేరస్తులను పట్టుకోవడానికే సీసీ కెమెరాలు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రస్తుత సమాజంలో నేరాల నియంత్రణలో, నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని స్థానిక ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మా గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో ఘన్‌పూర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వ్యాపారస్తులు, ప్రముఖులతో సీసీ కెమెరాల వినియోగంపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ వ్యాపారస్తులందరూ తమ షాపులు, ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ సట్ల రాజు, ఎస్‌ఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాల్వ ఆక్రమణపై చర్యలు చేపట్టాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీరాములు

దేవరుప్పుల : గొల్లపల్లి చెరువుకు కేటాయించిన కెనాల్ కాల్వ భూమిని దురాక్రమణ చేసి పలు నిర్మాణ పనులు చేపట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో గొల్లపల్లి శివారులో కాల్వ(పారుకం)స్థలంపై అక్రమ రైసుమిల్లు నిర్మాణ పనులు చేపట్టిన విషయమై ఏఓ రవీందర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నవాబుపేట రిజర్వాయర్ ద్వారా దేవరుప్పుల మీదుగా గొల్లపల్లి చెరువుకు సాగునీరు అందించే కెనాల్ కాల్వ పనులు సజావుగా కొనసాగించాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించిన సదరు అధికార యంత్రాంగం రైస్‌మిల్లు యజమానికి బాసటగా నిలిచి ఆయకట్టు రైతులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు సత్వరమే విచారణ చేపట్టి 10 సర్వే నంబరులో 0.30 గుంటల స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణ పనులను తొలగించి కాల్వ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బీజేపీది నిరంకుశ పాలన : సీపీఐ



జనగామ రూరల్: చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న కాంగ్రెస్, సీపీఐ నేతలు



నర్మెట : రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


జనగామ రూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నానాటికి నిరంకుశ పాలన చేపడుతుందని తక్షణమే అలాంటి చర్యలు మానుకోవాలని ప్రజాపాలన చేయాలని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికే ఇందిర, సీనియర్ నాయకుడు సర్వాల నర్సింహారావు అన్నారు. పార్లమెంట్‌లో ఎంపీల సస్పెన్షన్ వేడుకలకు నిరసనగా శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ పార్టీతో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్దిరాములు, వేణుమాధవ్, కృష్ణస్వామి, సమ్మయ్య, సీపీఐ నాయకులు జనార్దన్ పాల్గొన్నారు.

పాలకుర్తి: పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీల 146 ఎంపీలను సస్పెండ్ చేయడం సరైంది కాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యుల సస్పెండ్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కుమారస్వామి ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనుమల మ ల్లారెడ్డి, జిల్లా నాయకులు కృష్ణమూర్తి, కుమార్, కృష్ణమూర్తి, మల్లారెడ్డి, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఆది నారాయణ, భార్గవ్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: ఎంపీల సస్పెన్షన్‌కు నిరసనగా పార్టీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుక్రవారం నర్మెట చౌరస్తాలో గంటకుపైగా రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కళ్యాణం మురళి, సర్పంచ్ కుంటి జగన్, జిల్లా మండల బాధ్యులు భూక్య జయరాం, ఫరీదుల యాదయ్య, పరశురాములు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి, ప్రధాన కార్యదర్శి అల్వాల ఎల్లయ్య, నాయకులు నిమ్మ కరుణాకర్ రెడ్డి, వేణువందన, చెరుకూరి శ్రీనివాస్, దిడ్డిగ రమేష్, వెంకట్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.


నిరుపేదలకు 'బాలయేసు' క్రిస్మస్ కానుకలు



పేదలకు కానుకలు అందిస్తున్న విద్యార్థులు

దేవరుప్పుల : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ యాజమాన్యం సౌజన్యంతో నిరుపేదలకు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. శుక్రవారం కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాలకు చెందిన మొత్తం 30 గ్రామాల్లో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు ఆధ్వర్యంలో 300 మందికి విద్యార్థుల చేతుల మీదుగా క్రిస్మస్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పదని, ఇలాంటి క్రమంలో ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దాంట్లో కొంత ఇతరులకు సాయం చేస్తే పొందే సంతృప్తి మాటల్లో చెప్పలేమన్నారు. కానుకలు పేదలకు ఇవ్వడంపై పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజా, మాధవి, అనిత, విజయలక్ష్మి, మదన్‌మోహన్, మహేష్ , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సెయింట్ పాల్స్'లో మినీ క్రిస్మస్ వేడుకలు



మినీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మరియా జోసెఫ్, అధ్యాపకులు

జనగామ రూరల్: పట్టణంలోని నెహ్రూపార్క్ వద్ద గల సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఫాదర్ ఎస్.మరియా జోసఫ్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో క్రీస్తు జన్మవృత్తాంతం తెలిపేలా ఆకర్షణీయంగా క్రిబ్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి విద్యార్థులచే నాటక ప్రదర్శన, నృత్యాలు చేసి ఆడిపాడారు. ప్రతి ఒక్కరు శాంతి దయాప్రేమతో ఉండాలని అప్పుడే సమస్యలు ధరిచేరవని అన్నారు.